ట్రిపుల్‌ఆర్ బాధిత రైతులతో కలిసి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

ట్రిపుల్‌ఆర్‌పై రైతులు ఫైర్

- **భువనగిరిలో రైతుల మహాధర్నా**
- **మొదట అనుమతి ఇచ్చి..తెల్లారేసరికి టెంట్‌ను పీకేసిన పోలీసులు**

భువనగిరి అర్బన్, జనవరి 25 : ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు ముందస్తుగా డీసీపీ వద్ద అనుమతి తీసుకొని శుక్రవారం ఏర్పాట్లు చేశారు. కాగా, శనివారం తెల్లవారేసరికి ధర్నా ప్రాంతంలోని టెంట్లు, కార్పెట్లను పోలీసులు ఎత్తేశారు. కలెక్టరేట్ లోకి రైతులు వెళ్లకుండా భువనగిరి-రాయగిరి రహదారిలో బారికేడ్లు, ఇనుప కంచె వేసి దిగ్బంధించారు. దీంతో బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ నాయకులతో కలిసి ట్రిపుల్ బాధిత రైతులు రోడ్డుపైనే ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ లోపలికి అనుమతి కోరగా పోలీసులు అడ్డుకొని తోసేశారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్‌ను డీసీపీ రాజేశ్‌చంద్ర అడ్డగించారు. రైతుల సమస్యను అధికారులకు విన్నవించుకునే అవకాశం కల్పించకపోతే ఎలా అని పైళ్ల ప్రశ్నించడంతో కేవలం నలుగురికి అవకాశం ఇచ్చారు. దీంతో ఇద్దరు రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, క్యామ మల్లేశ్ కలెక్టరేట్‌లోకి వెళ్లారు. అప్పటికే కలెక్టరేట్‌లో ఉన్న ఎంపీ లక్ష్మణ్‌తో కలిసి అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పైళ్ల మాట్లాడుతూ ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చుతానని ఎన్నికల సమయంలో భువనగిరిలో ప్రియాంకగాంధీ చేసిన వాగ్ధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిరాకరిస్తున్నదని విమర్శించారు. మాయమాటలతో గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీకి రైతుల గోసపై సోయిలేదని మండిపడ్డారు.

రైతులు చస్తుంటే ఏం చేస్తున్నరు?

- **ప్రభుత్వ యంత్రాంగానికి ఎందుకింత నిర్లక్ష్యం?**
- **రైతుల ఆత్మహత్యలపై సర్కార్‌దే బాధ్యత**
- **10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి**
- **వారంలో నలుగురి ఆత్మహత్య బాధాకరం**
- **అధైర్య పడొద్దు.. బీఆర్‌ఎస్ అండగా ఉంటది : రైతులకు హరీశ్‌రావు భరోసా**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతులు వరుసగా బలవన్మరణాలకు పాల్పడుతుంటే ప్రభుత్వం, యంత్రాంగం ఏం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని శనివారం ఎక్స్ వేదికగా డిమాండ్‌చేశారు. 'ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం వార్త మన్నూరుకు చెందిన రైతు మామిళ్ల నరసయ్య అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విచారకరం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వారం రోజుల్లోనే నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం. రైతుల మరణ మృదంగం కొనసాగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఏం చేస్తున్నట్టు? కాంగ్రెస్ పాలనలో రైతులకు భరోసా లేక మనోధైర్యం కోల్పోతున్నరు. అందరికీ అన్నంపెట్టే అన్నదాతకు కాంగ్రెస్ పార్టీ సున్నం పెడుతున్నది. నమ్మి ఓటేసిన పాపానికి నట్టేట ముంచి, నమ్మకద్రోహం చేస్తున్నది. రుణ మాఫీ పూర్తి చేసినట్టు రంకెలేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారూ.. అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతులకు ఏమని సమాధానం చెప్తరు? రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఆ రైతు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి' అని డిమాండ్ చేశారు. 'ఆత్మహత్యలు పరిష్కారం కావు.. బతికుండి కొట్లాడుదాం. అధైర్యపడొద్దు, బీఆర్‌ఎస్ పార్టీ మీకు అండగా ఉంటది' అని రైతులకు హరీశ్ భరోసా ఇచ్చారు.

తప్పులు ఎత్తిచూపితే జర్నలిస్టులపై కేసులా?

ప్రభుత్వ తప్పులు ఎత్తిచూపిన జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని హరీశ్ ప్రశ్నించారు. ఇంటి పన్ను కింద వృద్ధుల పింఛన్ పైసలు జమ చేసుకోవడం అన్యాయమంటూ వార్త రాసిన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల విలేకరులు అత్తె సాగర్ (నవ తెలంగాణ), ఓడ్నాల సత్యనారాయణ (నమస్తే తెలంగాణ)పై అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను నొక్కేయడమేనా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే? అని నిలదీశారు. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపితే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడతారా? అని పశ్నించారు. ఇది ప్రజాపాలన కాదు.. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, పత్రికా స్వేచ్ఛకు విలువ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యువతకు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని హరీశ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఓటు నమోదు చేసుకొని ప్రజాస్వామ్యాన్ని బలపరచాలని విజ్ఞప్తిచేశారు. 'జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడికి హృదయపూర్వక శుభాకాంక్షలు. ఓటు కేవలం హక్కు మాత్రమే కాదు. అది మన దేశానికి, సమాజానికి ఇచ్చే ఒక ప్రామాణిక వాగ్దానం. ప్రతి ఓటు ముఖ్యమే. ప్రతి స్వరం విలువైనదే. మార్పు తీసుకురండి. మీ ఓటు మీ భవిష్యత్తు' అని పేర్కొన్నారు.

లోకం పోకడ

సీఎంవి కుత్సిత రాజకీయాలు

- **దిగజారుడు రాజకీయాలు దురదృష్టకరం**
- **బీఆర్‌ఎస్ నేత శ్రవణ్ దాసోజు ఆగ్రహం**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన బృందం ఏర్పాటుచేసిన హోర్డింగ్ కుత్సిత రాజకీయాలకు ప్రతీక అని బీఆర్‌ఎస్ నేత డాక్టర్ శ్రవణ్ దాసోజు ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు హోర్డింగ్ పెట్టడం రేవంత్‌రెడ్డి పనితీరులోపం, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని మండిపడ్డారు. 'ఇది తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే ఒక చీప్ ప్రాపగాండా. సీఎం స్థాయిలో ఉండి ఇలాంటి తక్కువ స్థాయి రాజకీయాలు చేయడం దురదృష్టకరం' అని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు నిరాధారమైన నిందారోపణలు చేయడం తగదని హితవు పలికారు. దావోస్ సమ్మిట్-2025లో రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని తగ్గించిందని విమర్శించారు. అంతర్జాతీయ వేదికపై ఆయన వేషధారణ, తప్పుడు మాటలతో పెట్టుబడుల హామీలు ఇవ్వడం, రాష్ట్ర ఇమేజ్‌ను దెబ్బతీశాయని తెలిపారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి రేవంత్‌రెడ్డి దిగజారి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. 'పనితీరు ద్వారా చూపించాల్సిన చోట, రేవంత్‌రెడ్డి ఇలాంటి చీప్ రాజకీయాలను అనుసరిస్తున్నారు. ఇది తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదు' అని విమర్శించారు.

రోడ్డెక్కిన వేరుశనగ రైతులు

- **మద్దతు ధర కోసం ఆందోళన**
- **గతవారం క్వింటాలుకు 6,500**
- **ఇప్పుడు 4,500 మాత్రమే**
- **వారంలోనే 2 వేలు తగ్గడంపై నిలదీత**

పరిగిలో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న వేరుశనగ రైతులు

పరిగి, జనవరి 25: ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర దక్కకపోవడంపై అన్నదాతలు భగ్గుమన్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి, అధికారులతో కుమ్మక్కై ఒక్క వారంలోనే క్వింటాలుకు రూ.2 వేలు వరకు ధర తగ్గించడంపై పరిగి వేరుశనగ రైతులు మండిపడ్డారు. అధికారుల తీరుకు నిరసనగా హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిరసనకు దిగడంతో రెండు గంటలపాటు ట్రాఫిక్‌జామ్ అయింది. పరిగి మార్కెట్‌యార్డుకు పరిగి, బొంరాస్‌పేట్ మండలాల రైతులు శనివారం పెద్ద మొత్తంలో వేరుశనగ తీసుకువచ్చారు. వ్యాపారులు కుమ్మక్కై గత వారంతో పోలిస్తే క్వింటాలుకు రూ.2 వేలు తక్కువ ధర కోట్ చేశారు. గత శుక్రవారం క్వింటాలుకు రూ.6,500 వరకు చెల్లించగా.. శనివారం రూ.4500 మాత్రమే ధర కోట్ చేయడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. జాతీయ రహదారిపై నిరసనలకు దిగడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అనంతరం మార్కెట్‌యార్డుకు వెళ్లి దుకాణాలు మూసివేయించి, మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఒక్క వారంలోనే ధరలు ఎందుకు తగ్గాయంటూ అన్నదాతలు మండిపడ్డారు. కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యాపారులు తక్కువ ధర కోట్ చేస్తున్నారని, తక్‌పట్టీలు ఇవ్వడం లేదని ఆరోపించారు. రైతులతో మాట్లాడిన ఎస్‌ఐ సంతోష్‌కుమార్ వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అధిక ధర చెల్లించేలా చూస్తామని, లేకపోతే సోమవారం ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేలా చూస్తామని ఎస్‌ఐ, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి రైతులకు హామీ ఇచ్చారు.

ప్రజల ఆకాంక్షను చాటిచెప్పే ఆయుధం ఓటు: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జనవరి 25 (నమస్తేతెలంగాణ): ప్రజల ఆకాంక్షను చాటిచెప్పే ఆయుధమే ఓటు అని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ రాజ్యాంగ నిర్మాతలు మనకు అప్పగించిన కర్తవ్యాన్ని గుర్తుచేసుకుందామని పేర్కొన్నారు.

విద్యార్థినిపైకి చెప్పు విసిరిన టీచర్

- ***దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు***
- ***ఉపాధ్యాయుడి సస్పెన్షన్***

బల్మూరు, జనవరి 25 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం కొండనాగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు విద్యార్థినిపైకి చెప్పు విసిరాడు. స్థానికుల కథనం మేరకు.. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు రిహార్సల్స్ నిర్వహించింది. 9వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి శిక్షణ ఇస్తుండగా.. బయట ఆటల పోటీలు ముగించుకొని సాయిలీల అనే విద్యార్థి నవ్వుతూ తరగతిలోకి వెళ్లింది. తనను చూసే నవ్విందని తప్పుగా అనుకున్న ఉపాధ్యాయుడు చెప్పు విసిరాడు. అది కాస్తా సాయిలీల పక్కనే ఉన్న మరో విద్యార్థిని అంజలి తగలటంతో స్వల్ప గాయమైంది. విషయం తెలుసుకున్న ఇద్దరి విద్యార్థినుల తల్లిదండ్రులు శనివారం పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న డీఈవో రమేశ్‌కుమార్.. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాళ్లు మోయించిన టీచర్లపై వేటు

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 25: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులతో పనులు చేయించిన ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. సంగారెడ్డి పట్టణంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులతో కంకర, రాళ్లు మోయించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. స్పందించిన కలెక్టర్ వల్లూరి క్రాంతి చర్యలకు ఆదేశించారు. విచారణ అనంతరం ఉపాధ్యాయులు మంజుల, శారద, నాగమణిని సస్పెండ్ చేస్తూ డీఈవో ఎస్ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఘటనపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఫైర్ అయ్యారు. విద్యార్థులతో కంకర మోయించడంపై బాధాకరమని పేర్కొన్నారు.

అన్నారం బరాజ్‌లో సీపేజీని అరికట్టాం

- **ఎన్‌డీఎస్‌ఏ సూచనలను పాటించాం**
- **కాళేశ్వరం కమిషన్ ఎదుట నిర్మాణ ఏజెన్సీ ఆఫ్కాన్స్ నివేదన**
- **పూర్తయిన బహిరంగ విచారణ**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): అన్నారం బరాజ్‌లో తలెత్తిన సీపేజీ సమస్యను పూర్తిగా అరికట్టామని, ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు గ్రౌటింగ్ చేశామని నిర్మాణ ఏజెన్సీ ఆఫ్కాన్స్ వెల్లడించింది. ఈ మేరకు కాళేశ్వరం కమిషన్ ఎదుట నివేదించింది. కాళేశ్వరం కమిషన్ నిర్వహిస్తున్న బహిరంగ విచారణ శనివారం సైతం కొనసాగింది. అందులో భాగంగా అన్నారం బరాజ్ నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ హైడ్రో బిజినెస్ యూనిట్ హెడ్ నాగమల్లికార్జునరావు, జీఎం శేఖర్ దాస్‌లను జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. అన్నారం బరాజ్ నిర్మాణం, తలెత్తిన సాంకేతిక సమస్యలు, చేపట్టిన నివారణ చర్యలు తదితర అంశాలపై ఆరా తీశారు. బరాజ్ నీటి నిల్వ సామర్థ్యం పెంపు, మేడిగడ్డ బరాజ్ నుంచి అన్నారం వరకు నీటిని తరలించే కాలువ పొడవును తగ్గించే చర్యల్లో భాగంగా తొలుత ఎంపిక చేసిన స్థలానికి 2.2 కిలోమీటర్ల దిగువన బరాజ్‌ను నిర్మించామని వివరించారు. వరద ప్రవాహ వేగానికి సీసీ బ్లాకులు కొట్టుకుపోయాయని, అందుకు గల కారణాలపై పుణెకి చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్‌లో పని చేసిన రిటైర్డ్ ఇంజినీర్ పీబీ దేవలలికర్, ఎన్‌హెచ్‌పీఎస్‌కు చెందిన ఎస్సీ మిట్టల్, ఇన్‌ఫ్రా ప్లాన్ అనే సంస్థకు చెందిన ఓ నిపుణుడిని కన్సల్టెంట్లుగా నియమించుకుని కేస్ స్టడీస్ చేయించామని, అదేవిధంగా డ్యామ్ సేఫ్టీ ప్యానెల్ మెంబర్ రామరాజు, ఈఎన్‌సీ మురళీధర్‌లు టీజీఈఆర్‌ఎల్‌తోనూ మోడల్ స్టడీస్ చేయించారని వెల్లడించారు. బరాజ్ దిగువన సరిపోనూ టెయిల్ వాటర్ లేకపోవడం, ఎనర్జీ డిసిపేషన్ ప్రొటెక్షన్ వర్క్స్ సరిగ్గా లేకపోవడంతోనే సీసీ బ్లాకులు డ్యామేజ్ అయినట్టు వారు తేల్చారని పేర్కొన్నారు. అదనంగా మరో స్టిల్లింగ్ బేసిన్‌ను, రాఫ్ట్‌కు 60 మీటర్ల దూరంలో మరో రాఫ్ట్‌ను, సీసీ బ్లాక్స్‌కు ముందట మరో ఆప్రాన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారని తెలిపారు. 2022లో తొలిసారి బరాజ్‌లో సీపేజీని గుర్తించామని, ప్రభుత్వ అనుమతి తీసుకుని ఢిల్లీ నుంచి నిపుణులను పిలిపించి గ్రౌటింగ్ చేసి, ఆ సమస్యను పరిష్కరించామని వివరించారు. ప్రస్తుతం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సిఫారసుల మేరకు బరాజ్‌కు టెస్టులు చేశామని, ఆ నివేదికలనూ సమర్పించామని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సిఫారసుల మేరకు సీసీ బ్లాకులను పునరుద్ధరించామని, జియోఫిజికల్ టెస్టులు నిర్వహించామని, ఇసుక మేటలను తొలగించామని కమిషన్‌కు నివేదించారు. బరాజ్‌లో క్రాక్స్ ఏమైనా వచ్చాయో, లేదో చెక్ చేసేందుకు డ్రోన్ సర్వే చేశామని, ఎక్కడా ఒక్క క్రాక్ కూడా బరాజ్‌కు పడలేదని నిర్మాణ సంస్థ వెల్లడించింది. ఇదిలా ఉండగా 3 బరాజ్‌లకు సంబంధించి ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులందరి విచారణ శనివారంతో పూర్తయిందని కమిషన్ వర్గాలు వెల్లడించాయి. సోమవారం నుంచి కమిషన్‌కు వ్యక్తిగతంగా అఫిడవిట్లను దాఖలు చేసినవారిని విచారించనున్నట్లు తెలుస్తున్నది. అందులో భాగంగా ఎలక్ట్రిసిటీ ఇంజినీర్ రఘు, రిటైర్డ్ ఇంజినీర్ దొంతుల లక్ష్మీనారాయణను సోమవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు సమాచారం.

ఇరిగేషన్‌లో ప్రమోషన్ల కోసం డీపీసీ

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర నీటిపారుదల శాఖలో ప్రమోషన్లకు సంబంధించి డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో భాగంగా తొలుత డీఈఈ ప్రమోషన్లకు అర్హులైన ఏఈఈల సీనియారిటీ జాబితాను పంపించాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే ఈఈ, ఎస్‌ఈ నుంచి సీఈ, ఆపై ఈఎన్సీ వరకు క్యాడర్లకు సంబంధించి ప్రమోషన్లను కూడా కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తున్నది. మరోవైపు ప్రస్తుతం కూడా గతంలో మాదిరిగానే అడ్‌హాక్ ప్రమోషన్లను కల్పించనున్నారు. ఇప్పటివరకు రెగ్యులర్ ప్రమోషన్లను కల్పిస్తారని భావించినా ఆ ఆశలు అడియాశలయ్యాయని ఇంజినీర్లు వాపోతున్నారు.

ప్రజలపై కాంగ్రెస్ సర్కారు కక్ష సాధింపు

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర పార్టీల నాయకులు, ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, కోఆపరేటివ్ సొసైటీల నాయకులను అణచివేయాలని చూస్తున్నదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. పీఏసీఎస్‌లో ఉన్న నాయకులను పార్టీల వారీగా విభజించి వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని దుయ్యబట్టారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెడగపల్లి విండో చైర్మన్ రమణారావుతో కలిసి ఆయన మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గంలో 12 కోఆపరేటివ్ సొసైటీలు ఉండగా ఆరింటిలో అవినీతి జరిగిందం టూ స్థానిక ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ ఫిర్యాదు చేస్తే ఒకే రోజులో ప్రిన్సిపల్ సెక్రటరీ, రిజిస్ట్రార్‌కు లేఖ రాయ డం, డీసీవో రావడం, వెంటనే విచారణ అధికారులను నియమించారని పేర్కొన్నారు. రికార్డులను సరిగా చూడకుండా డీసీవో షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని హైకోర్టు తప్పు పట్టడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.

ప్రైవేటులోనూ ఓబీసీ రిజర్వేషన్లు కేటాయించాలి

- **దక్షిణాది రాష్ట్రాలకు ఎక్కువ నిధులు ఇవ్వాలి**
- **బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**
- **బెంగళూరులో కేంద్ర మంత్రికి వినతి**

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా ప్రైవేట్ రంగంలోనూ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని దక్షిణ భారత ఓబీసీ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు, తెలంగాణ మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, గోవా, మహారాష్ట్రకు పెద్దమొత్తంలో నిధులు కేటాయించాలని, ఆయా రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో పరిశ్రమలను నెలకొల్పాలని కోరారు. బెంగళూరులో కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి జేడీ కుమారస్వామిగౌడను శనివారం ఆయన కలిశారు. ఓబీసీ సంఘాల దక్షిణాది రాష్ట్రాల నేతలైన బాలరాజు గుత్తేదార్, శివకుమార్, ఓంకార్, గోపిగౌడ్‌తో ఆయన మంత్రిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్రం తరహాలో కర్ణాటకలోనూ అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మించాలని, నీరా పాలసీ రూపకల్పన చేయాలని కోరారు. మత్స్యకారులు, గొర్రెలు, మేకల పెంపకందారుల, విశ్వకర్మలు, చేనేత, కల్లుగీత కార్మికుల కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని కుమారస్వామికి శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తిచేశారు.

జగిత్యాలలోని సీఎస్ఐ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెత్త ఊడుస్తున్న విద్యార్థులు

విద్యార్థులే స్వీపర్లు

పాఠశాల ఆవరణలో కండోమ్‌లు

జగిత్యాల, జనవరి 25 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్‌లో ఉన్న సీఎస్ఐ ప్రాథమిక పాఠశాల ఆవరణను శుభ్రపరిచేందుకు శనివారం విద్యార్థులతో చీపుర్లు పట్టించారు అక్కడి హెచ్‌ఎం వినోద్. గణతంత్ర దినోత్సవం సందర్భంగా హెచ్‌ఎం ఆదేశాల మేరకు విద్యార్థులు చెత్తను ఊడ్చి పక్కన పారేశారు. కాగా, ఆవరణలో కండోమ్ ప్యాకెట్లు కనబడటంతో విషయం తెలుసుకున్న మీడియా.. హెచ్‌ఎంతో పాటు సీఎస్ఐ చర్చి కార్యదర్శులను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానం వచ్చింది. ఈ విషయమై డీఈవో రాములును వివరణ అడగగా ఎంఈవోతో విచారణ చేయిస్తామని తెలిపారు.

తెలంగాణ, వర్గీకరణ ఉద్యమాలు న్యాయమైనవే

జాతి బిడ్డల భవిష్యత్తు కోసం హైదరాబాద్‌కు తరలిరావాలి : మంద కృష్ణ మాదిగ

సిద్దిపేట అర్బన్, జనవరి 25 : తెలంగాణ ఉద్యమం, వర్గీకరణ ఉద్యమం రెండూ న్యాయమైన పోరాటాలే అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన జరిగే 'లక్ష డప్పులు, వేల గొంతుకలు' కార్యక్రమ సన్నాహక సమావేశం శనివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ.. జాతి బిడ్డల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో నాడు లగడపాటి పోషించిన పాత్రే నేడు వర్గీకరణ విషయంలో వెంకటస్వామి కుటుంబం పోషిస్తున్నదని మండిపడ్డారు. వర్గీకరణ అమలు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఉన్న మాల నాయకులకు రేవంత్‌రెడ్డి తలొగ్గారని పేర్కొన్నారు.

హనుమకొండ జిల్లా హంటర్‌రోడ్డులో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న బల్దియా అధికారులు

మంద కృష్ణ కుటుంబీకుల నిర్మాణాల కూల్చివేత

అక్రమ నిర్మాణాలుగా గుర్తించి తొలగింపు

వరంగల్, జనవరి 25 : హనుమకొండ జిల్లా హంటర్‌రోడ్డులో సర్వేనంబర్ 125కేలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కుటుంబ సభ్యుల నిర్మాణాలను గ్రేటర్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. తన 400 గజాల స్థలాన్ని మంద జ్యోతి, మంద కృష్ణ మాదిగ, ఇద్దయ్య ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని రెండున్నరేళ్ల క్రితం నంబూరి చారుమతి గ్రేటర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణలో అక్రమణ వాస్తవమేనని తేలడంతో కూల్చివేయాలని 2022లో మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. రెండేండ్లు దాటినా కూల్చివేతలు చేపట్టకపోవడంతో బాధితురాలు హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. దీంతో బల్దియా ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారీ చేసింది. ఎస్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాలను రద్దు చేయాలని మంద కృష్ణమాదిగ హైకోర్టును ఆశ్రయించగా అక్కడ చుక్కెదురైంది. దీంతో అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

పోచారంలో హైడ్రా కూల్చివేతలు

ఆక్రమణలనే కూల్చేశాం : కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లి వద్ద దివ్యనగర్ లేఅవుట్‌లో శనివారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. రోడ్లను మూసేసి 4కిలోమీటర్ల మేర అక్రమంగా నిర్మించిన భారీ ప్రహరీని 12 హెవీ బుల్డోజర్లతో కూల్చేశారు. దివ్య లేఅవుట్‌లో ఉన్న తమ ప్లాట్ల వద్దకు వెళ్లే వీలులేకుండా ఎన్‌ఎంఆర్ సంస్థ యజమాని నల్లమల్లారెడ్డి ప్రహరీ నిర్మించారని ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా.. ప్రహరీ అక్రమ కట్టడమని తేల్చి కూల్చివేసింది. నల్లమల్లారెడ్డి తన లేఅవుట్‌కు భద్రత పేరిట 200 ఎకరాల చుట్టూ నిబంధనలు ఉల్లంఘించి ప్రహరీ కట్టారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. విచారణ అనంతరం స్థానిక మున్సిపల్, రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడమేనని నిర్ధారించిన తర్వాతే కూల్చివేసినట్టు పేర్కొన్నారు.

దివ్యనగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న బుల్డోజర్

నర్సుపై చేయి చేసుకున్న వైద్యురాలు

గూడూరు, జనవరి 25 : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం సాయంత్రం నర్సుపై వైద్యురాలు చేయి చేసుకున్నది. విశ్వసనీయ సమాచారం మేరకు.. శనివారం సాయంత్రం ఓ వ్యక్తి కడుపు నొప్పి వస్తున్నదని దవాఖానలోని వైద్యురాలి వద్దకు రాగా, పై అంతస్తులో ఉన్న ఇన్‌వార్డులో నర్సుల వద్దకు వెళ్లి ట్రీట్‌మెంట్ తీసుకోవాలని సూచించింది. దీంతో ఆ పేషెంట్ ఇన్‌వార్డుకు వెళ్లి విషయం నర్సుకు తెలుపగా, డాక్టర్ వద్ద మందులు లేదా, ఇంజెక్షన్ రాయించుకొని వస్తే వైద్యం చేస్తామని చెప్పింది. ఆ పేషెంట్ మళ్లీ డాక్టర్ వద్దకు వెళ్లగా.. దీంతో ఆగ్రహానికి గురైన వైద్యురాలు ఇన్‌వార్డు వద్దకు వెళ్లి పేషెంట్‌ను తన వద్దకు ఎందుకు పంపుతున్నావని వాగ్వాదానికి దిగింది. ఇద్దరి మధ్య మాటా మాట పెరిగి చివరికి నర్సుపై డాక్టర్ చేయి చేసుకున్నది. దీంతో మిగతా నర్సులు, వైద్యురాలికి మధ్య వాగ్వాదం తీవ్రస్థాయిలో జరిగినట్టు తెలిసింది.